ఉచితము

శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారి

రాష్ట్రగానం

ఇది కవితా సౌందర్యము చేతను, విషయగౌరవము చేతను ఆంధ్రహృదయముల నుఱ్ఱూతలూగించిన జాతీయ కావ్యము. ౧౫౦ పద్యములతో, ౬౨ పుటలతో ముద్దుగుల్కు సంపుటి అయినను ఆంధ్రరాష్ట్రప్రచారమే పరమార్థముగా నెంచి పీతైనంత చౌకగా నొసంగుటకు రెండవకూర్పులో దీని వెల ౦-౮-౦ నుండి ౦-౪-౦ కు తగ్గించితిమి. ౦-3-౦ తపాలా బిళ్ళలు పంపినచో బుక్ పోస్టు ద్వారా పంపబడును.

విలాసము :

జాతీయకవితా కుటీరము.

పొన్నూరు

(గుంటూరు జిల్లా.)

# దీపావళినాడు

రచయిత :

సి. యస్. శర్మ.

జనం! ధనం!

ఆదీపావళి సామాన్లను చూస్తో, ఉత్సాహానందాలతో పొంగిపోయింది ఆ చిన్ని హృదయం.

చిన్న చిన్న పిల్లలకు తండ్రులు కొని యిస్తున్న దృశ్యాల్ని చూసి, తనకెవ్వరూ కొని యివ్వడంలేదేఅని నిరాశతో క్రుంగిపోయింది ఆగుండె- నిరశ్రురోదనచేస్తో!

ఎవరి సరదాలు వారివి. రాము చేస్తున్న నిరశానిరశ్రురోదన వినే దెవరు? ఓదార్చేదెవరు?

కదలలేక కదలలేక- పెద్ద నిట్టూర్పు విడిచి అక్కణ్ణుంచి కదిలాడు రామం.

'నాన్నా! నాకొకని యివ్వవూ?'అని అడగలేక అడగలేక అడిగాడు,-దమ్మిడీ చేతిలోలేని ఆగర్భదరిద్రపుతండ్రిని!

'చూస్తున్నావుగా బాబూ! మనబ్రతుకు! ఈపూటకుంటే, అపూటకులేదు!' అని కంట నీరెట్టాడు ఆకన్నతండ్రి!

కన్నీళ్ళను హృదయంలోకి కుక్కుకుంటూ, బజార్లోకి పారిపొయ్యాడు

ఆకల్ని తోసేసుకుంటూ, అల్లా చూస్తూ, నిలబడిపొయ్యాడు- రామం! చీకటి పడిందాక!

* * *

దీపావళి రాత్రి! దీపాలకాంతితో మెరసి పోతోంది, ఆ అమావాశ్యరాత్రి. ఇంటింటా దీపాలు! నవ్వుల మంటలు!

గుమ్మంలో, ఒంటరిగ వెల్గుతున్న ఆముదప్రదీపం దగ్గరకూర్చుని, కళ్ళతో చుట్టూచూస్తున్నాడు రామం.

చింకిశాల్వను కప్పుకుని, అవమానాగ్నిలో కాలిపోతోంది గదిలో ఆముసలి గుండె!

చీకట్లను చీల్చుకుంటూ, చుక్కల్లోకి పోతున్నై తారాజువ్వలు!

చుట్టూ దీపాలు...మంటలు...చప్పుళ్ళు!

రామం కళ్ళు మూతలు పడ్తోవుంటే ఒళ్లు ముడుచుకుని, తండ్రి దగ్గర పడుకున్నాడు!

చినుకులు ఇంటింటి వెలుగుతున్న దీపాల్నార్పేశాయి. ఆకాశాన మెరుపులు!...ఉరుములు!

తలుపులు బిగించుకుని వెచ్చగ పడుకున్నారు 'కల' వాళ్ళు.

రామంలాంటి లేనివాళ్లు, ఒళ్లుముడుచుకుని ఆకలితో, నిరాశతో నిద్రపోతున్నారు!

* * *

తెల్లవారింది!

లేనివారి బ్రతుకుకూడ...!

దీపావళినాటి తుఫాను, పాతికమంది పెద్దవాళ్ళనీ...పదిమంది చిన్నవాళ్ళనీ...మింగేసింది.

ఆ కునుకువేసిన ప్రాణుల్లో రామం-రామం తండ్రీకూడ వున్నారు!

దుర్భరదారిద్ర్యదావానలం లోంచి, విముక్తులనుగ చేసింది ఆతుఫాను!

ఆతుఫానుకన్నా జాలివుందిగాని లోకానికి లేదు.

రోడ్లనూ, గోడల్నీ కడిగేసింది శుభ్రంగా!

కానీ, సంఘంగుండెని కడగలేకపోయింది!

అసలు సంఘానికి గుండెవుందాఅని!